క్లుప్తంగా

నూకాంబిక ఆలయ అభివృద్ధికి విరాళం



నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక: తిమ్మరాజుపేట దళితవాడలో నిర్మాణంలో ఉన్న నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతలు సహకారం అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు మంగళవారం రూ.10,116 నగదును విరాళంగా అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం, సమసరత సేవా ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ఆలయ నిర్మాణం జరుగుతోంది. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కాండ్రేగుల రాజు పాల్గొన్నారు.

154 మందికి ఉచిత కంటి పరీక్షలు

మునగపాక : పాటిపల్లి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీ మంతుల దేముళ్లు-వెంకయమ్మ జ్ఞాపకార్థం పాస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, ఎంపీటీసీ ఇల్లా శిరీషా నాగేశ్వరరావు ప్రారంభించారు. విశాఖకు చెందిన మెడికవర్, అలాగే పుష్పగిరి కంటి ఆసుపత్రుల సౌజన్యంతో నిర్వహించిన శిబిరానికి పరిసర ప్రాంతాల నుంచి రోగులు హాజరయ్యారు. ఈ శిబిరానికి 154 మంది రోగులు హాజరయ్యారు. వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీమంతుల కన్నారావు, శంకర్ పాల్గొన్నారు.

బాలికల పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



పాఠశాల సిబ్బందికి ఫ్యాన్లు అందిస్తున్న శంకర్

నక్కపల్లి : స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు నక్కపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మేడేటి శంకర్ సుమారు రూ.10 వేలు విలువ గల నాలుగు సీలింగ్ ఫ్యాన్లు విరాళంగా అందజేశారు. మంగళవారం వాటిని పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. తరగతి గదుల్లో ఏర్పాటు చేసేందుకు ఈ ఫ్యాన్లు ఇచ్చినట్లు శంకర్ తెలిపారు. శంకర్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు



చిరంజీవి జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న స్థానిక నాయకులు, చిరంజీవి అభిమానులు

పాయకరావుపేట : మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుక కార్యక్రమం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. జన్మదిన కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, జనసేన నాయకులు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

తోటాడలో బ్లీచింగ్ పిచికారీ

మునగపాక : ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు అన్నారు. డెంగ్యూ జ్వరాలు సోకకుండా గ్రామంలో మంగళవారం బ్లీచింగ్ పిచికారీ నిర్వహించారు. జ్వరాలు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు

పాయకరావుపేట : మండలంలో గల అరట్లకోట, మాసాహెబుపేట గ్రామాల్లో ఒక్కొక్కటి అంగన్‌వాడీ ఆయా (హెల్పర్ పోస్టులు) ఖాళీలు వున్నాయని, ఈ నెల 29లోగా దరఖాస్తులు చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌజన్య తెలిపారు. అరట్లకోట బీసీఏ కేటగిరీలో, మాసాహెబుపేట ఎస్సీ కేటగిరీకి ఖాళీలు ఏర్పడ్డాయన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత మా ప్రభుత్వానిదే



ఉపమాకలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగనన్న ప్రభుత్వానిదేనని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మంగళవారం ఉపమాక గ్రామంలో రెండోరోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. తమకు అమ్మ ఒడి, రుణ మాఫీ, కాపునేస్తం వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నావడ్డీ రుణాలు ఇళ్ల స్థలాలు ఇళ్లు మంజూరయ్యాయని పలువురు ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ నక్కపల్లిలో 50 పడకల ఆస్పత్రి, డిగ్రీ కళాశాల మంజూరు చేశామన్నారు. జగనన్న అధికారంలోకి రాగానే మొదటి ఏడాదిలో ఇవి మంజూరు చేశారన్నారు. పాయకరావుపేట మెయిన్‌రోడ్డు నిర్మాణ పనులు కూడా మొదలు పెట్టామన్నారు. ఉపమాకలో గ్రామస్తులు కోరిన విధంగా రోడ్లు, కాలువలు, కుళాయిలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చి కొత్తగా నిర్మించుకునేందుకు ఇళ్లు కేటాయిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకోవాలన్నారు. అధికారం కోసం అడ్డమైన హామీలు ఇచ్చే చంద్రబాబును నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ నానాజీ, ఎంపీటీసీలు బుజ్జి, ఎం.దేవుళ్లు, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహమూర్తి, స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు హరిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు యలమంచిలి తాతారావు, నాయకులు మనబలా తాతారావు, నూక తాత పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతి



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ ఉమాదేవి

కోటవురట్ల: మండలంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని జెడ్పీ సర్వసభ్య సమావేశంలో కోరినట్టు జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి తెలిపారు. విశాఖలోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మండలానికి సంబంధించి పలు అంశాలను జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వివరించారు. అణుకు గిరిజన గ్రామానికి రోడ్డు వేయాలని, గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం ఏర్పాటు చేయాలని, ఆశ కార్యకర్తలను నియమించాలని కోరగా అంగన్‌వాడీ భవనం, ఆశ కార్యకర్త ఏర్పాటుకు జెడ్పీ చైర్‌పర్సన్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. అలాగే మండల కేంద్రంలో ఉన్న సీహెచ్‌సీలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని, వెల్‌నెస్ సెంటర్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, కైలాసపట్నంలోని కమ్యూనిటీ హాలు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్దాబత్తుల సత్యనారాయణ ఉన్నారు.

పెయ్యి దూడల ఉత్పత్తి పథకంపై అవగాహన

దుప్పితూరులో మొదటి ఆవు పెయ్యి జననం

అచ్యుతాపురం(అనకాపల్లి): పెయ్యి దూడల ఉత్పత్తి పథకంలో భాగంగా అచ్యుతాపురం మండలంలో మొదటి ఆవు పెయ్యి జన్మించిందని పశు సంవర్ధక శాఖ దోసూరు వైద్యురాలు వాత్సల్య తెలిపారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా ఆడ పెయ్యిలు పుట్టే అవకాశం 90 శాతం ఉంటుందని ఆమె వివరించారు. అచ్యుతాపురం మండలంలోని దుప్పితూరుకు చెందిన రైతు మోటూరు రాజుకు చెందిన ఆవుకు ఆడ పెయ్యి జన్మించిందని తెలిపారు. పాడి రైతుల్లో మరింత చైతన్యం, అవగాహన రావాలని పెయ్యి దూడల ఉత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తిమ్మాపురంలో దోమల మందు పిచికారీ



గ్రామంలో స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : తిమ్మాపురం గ్రామంలో ఇరువురికి డెంగీ సోకడంతో గ్రామం అంతా దోమల మందు పిచికారీ చేయించినట్టు పెనుగొల్లు పీహెచ్‌సీ అధికారి రాజేశ్వరి తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి మంగళవారం వైద్యాధికారి పర్యటించారు. పారిశుధ్య సమస్యను వెంటనే పరిష్కరించి దోమల మందు పిచికారీ చేయాలన్నారు. సర్పంచ్ కర్రి సత్యనారాయణ స్పందించి గ్రామంలో స్ప్రేయింగ్ చేయించారు. స్ప్రేయింగ్ పూర్తయ్యాక గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి మరింత మందికి పరీక్షలు నిర్వహిస్తామని వైద్యాధికారి తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

యలమంచిలి : యలమంచిలి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో అప్పలనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండలంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

హరిపాలెంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన



హరిపాలెంలోని వరి క్షేత్రాలను పరిశీలిస్తున్న లచ్చన్న

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న క్షేత్రాలను జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగాధిపతి లచ్చన్న మంగళవారం సందర్శించారు. వరి దుబ్బులు వేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఎక్కువ దిగుబడి పొందేందుకు గల మెలకువలను రైతులకు వివరించారు. జిల్లా కో-ఆర్డినేటర్ గోవింద్, ఇన్‌ఛార్జ్ నాయుడుబాబు పాల్గొన్నారు.

నాగులాపల్లిలో నేడు రక్తదాన శిబిరం

మునగపాక : నాగులాపల్లిలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు బీజేపీ జిల్లా ఐటీ విభాగం కన్వీనర్ మళ్ల కాలేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పంచాయతీ కార్యాలయం దరి రాజరాజేశ్వరి స్టేజిపై శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ గండి వెంకట సత్యనారాయణ, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఈ శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కాలేశ్వరరావు కోరారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న దృశ్యం



అచ్యుతాపురంలో ఎంఈవో కార్యాలయం ముందు ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

మునగపాక : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అలాగే తక్షణమే ఎంటీఎస్ అమలు చేసి వేతనాలు పెంచాలని సీఆర్‌పీలు లక్ష్మీనారాయణ, అచ్యుతకృష్ణ తదితరులు కోరారు.

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు నూకేష్, సత్తిబాబు, గోవింద, రామకృష్ణ, ఐఈఆర్‌పీ సుమతి, ఎంఐఎస్ రామలక్ష్మి, అకౌంటెంట్ వీరప్పారావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని విద్యా శాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం ఎంఈవో కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో పార్ట్‌టైం, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని రెగ్యులర్ చేయాలని వారు కోరారు. జూలై నెల పెండింగ్ జీతాలను చెల్లించాలని, ఎంటీఎస్ అమలు చేసి వేతనాలు పెంచాలని కోరారు. ఈ మేరకు ప్లకార్డులు ప్రదర్శించారు.

పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు



తిమ్మాపురంలో నూతన పింఛన్లకు ఎంపికైన వారితో మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్రమూర్తి

ఎస్.రాయవరం : ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందించేదుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఎంపీడీవో రామచంద్రమూర్తి అన్నారు. తిమ్మాపురం, పెదగుమ్ములూరు గ్రామాల్లో మంగళవారం నూతనంగా మంజూరైన పింఛన్ల లబ్ధిదారులను గుర్తించి వివరాలు తెలుసుకునేందుకు సచివాలయాల్లో దరఖాస్తుదారులతో సమావేశమయ్యారు. దరఖాస్తుదారుల అర్హత గుర్తించి ఆమోదించారు. పార్టీలకతీతంగా అర్హులను గుర్తించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల్లో అధికార పార్టీవారికే మొదటి ప్రాధాన్య ఇచ్చేవారని, ప్రస్తుతం సీఎం జగన్ మోహన్‌రెడ్డి అర్హులు అందరికీ పింఛను, ఇతర పథకాలు అందివ్వడం అభినందనీయమన్నారు. సమావేశంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

సంఘాల ఆర్థిక నిర్వహణపై వీవోఏలకు శిక్షణ



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం కొండమ్మ

మునగపాక : డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వెలుగు ఏపీఎం కొండమ్మ పిలుపునిచ్చారు. మునగపాకలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం గ్రామ సంఘాల వీవోఏలకు సంఘాల ఆర్థిక నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు, అప్పులు చెల్లించడంపై ప్రణాళిక తయారు చేసుకోవడంతో పాటు సామాజిక, ఆర్థిక కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అకౌంటింగ్ విధానంపై కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. లీగల్ కో-ఆర్డినేటర్ సీసీ శ్రీనివాస్, ఎఫ్‌పీవో సీసీ దేవానంద్, మండల సమాఖ్య అధ్యక్షులు రేవతి, కార్యదర్శి మరిడమ్మ, పలువురు వీవోఏలు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



ఉత్తమ పురస్కారాలు అందుకున్న అధికారులను సత్కరిస్తున్న నాయకులు, ఉద్యోగులు

మునగపాక : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని వెంకటాపురం సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి (తాతాజీ) అన్నారు. వెంకటాపురం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కర్రి త్రినాథ్, ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఆకలి గంగాభవాని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న విషయం తెలిసిందే. ఆయా ఉద్యోగులను మంగళవారం సచివాలయంలో సత్కరించారు. ఉప సర్పంచ్ బొమిరెడ్డిపల్లి సాయివజ్రం, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, పాలసంఘ అధ్యక్షుడు కాసులుబాబు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం



మరిడిమాంబ అమ్మవారి సన్నిధిలో భక్తులు

తుమ్మపాల: అనకాపల్లి మండలం కాపుశెట్టివానిపాలెం శ్రీ మరిడిమాంబ అమ్మవారి దేవాలయ మొదటి వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి, అమ్మవారికి పూజలు జరిపి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మణిపూర్ హింసకు వ్యతిరేకంగా శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో క్రైస్తవ, ప్రజా సంఘాల ప్రతినిధులు



వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

కశింకోట: మణిపూర్‌లో జరిగిన మారణకాండను నిరసిస్తూ మంగళవారం కశింకోటలో పలు క్రైస్తవ, ప్రజా సంఘాలు, ఐద్వా, మహిళా సంఘాలు, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, దళిత సంఘాలు ర్యాలీ నిర్వహించాయి. మూడున్నర నెలలుగా మణిపూర్‌లో సాగుతున్న హింసకు ప్రధాన కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో మత సామరస్యం, ప్రజా స్వామ్యాన్ని కాపాడాలని కోరారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి హత మార్చిన దుర్మార్గులను తక్షణమే చట్టపరంగా శిక్షించాలన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మణిపూర్‌లో దుర్మార్గుల విధ్వంసానికి గురైన చర్చిలను, గృహాలను ప్రభుత్వమే పునర్నిర్మించాలన్నారు. మైనార్టీ క్రైస్తవులుగా ఉన్న కుకీలను ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు తహస్లీదార్, పోలీసు స్టేషన్‌లలో వినతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.బెనర్జీకుమార్, కార్యదర్శి కె.ప్రేమ్‌కుమార్, సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా నాయకుడు రాజాన దొరబాబు, ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి, దళిత సంఘ నాయకుడు పావాడ కామరాజు, పాస్టర్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్.. రైతులు సేఫ్

- మండలంలో మొదలైన ఈ-క్రాప్
- సెప్టెంబర్ 15 వరకు నమోదు గడువు
- 11,283 మంది రైతులకు భరోసా

వ్యవసాయం.. గత ప్రభుత్వ హయాంలో దండగ. రైతు బాంధవుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాకతో సాగు తీరే మారింది. ఆరుగాలం శ్రమించి, ప్రజలకు తిండి గింజలు అందించే అన్నదాతను ఆదుకునేందుకు ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. పంట నష్టానికి సత్వర పరిహారం అందించేందుకు ఈ-క్రాప్ నమోదును తీసుకొచ్చారు. దీంతో పక్కాగా సాగు లెక్క తేలి, రైతుల్ని తక్షణమే ఆదుకునేందుకు వీలవుతోంది.



ఈ-క్రాప్ నమోదులో వ్యవసాయ అధికారులు

తుమ్మపాల: మండలంలో వరినాట్లు ఊపందుకున్నాయి. దీంతోపాటే ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ కూడా జోరందుకుంది. రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల ద్వారా రైతుకు అవసరమైన సేవలన్నీ ప్రభుత్వం అందిస్తోంది. సాగులో పెట్టుబడి సాయం నుంచి, ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల పంపిణీ చేస్తోంది. ఇపుడు సాగు చేస్తున్న పంట ఏ కారణం చేతనైనా నష్టపోతే, వారిని ఆదుకునేందుకు ఈ-క్రాప్‌లో పంట వివరాల నమోదు ప్రక్రియను వేగవంతం చేసింది.

సాగు విస్తీర్ణం 10 వేల ఎకరాలు

మండలంలో 10,864 ఎకరాల్లో ఏటా వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా వరినాట్లు వేసే ప్రక్రియ ఆలస్యమైంది. మండంలోని పల్లపు ప్రాంతాల్లో వరినాట్లు గత వారం నుంచి ప్రారంభం అయ్యాయి. ప్రస్తుతం జోరందుకున్నారు. ఇప్పటి వరకు మండలంలోని 1,465 ఎకరాల్లో పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. సెప్టెంబర్ 15లోగా ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాలు. ఈ-క్రాప్ పూర్తయితే మండలంలోని 11,283 మంది రైతులకు భరోసా దక్కనుంది.

వివరాల నమోదుతో ఎన్నో ప్రయోజనాలు

రైతులకు ఈ-క్రాప్ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలు తెలిసేలా వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో సమావేశాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. పంట నమోదు ద్వారా వరదలు, తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చి, పంట నష్టం జరిగితే పంటల బీమా వర్తిస్తుంది. సాగులో ఉన్న పంటల వారీగా ప్రభుత్వం ప్రకటించే పరిహారం రైతుల బ్యాంకు ఖాతాలకే నేరుగా జమ అవుతుంది. తక్కువ ధరకే మేలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, రాయితీపై వ్యవసాయ యంత్రాల పంపిణీకే ఇదే ప్రధాన ఆధారం. మరోవైపు రైతులు ఏయే ప్రాంతాల్లో ఏయే పంటల్ని, ఎంత విస్తీర్ణంలో సాగుచేస్తున్నారన్న వివరాలపై ప్రభుత్వానికి స్పష్టత ఉంటుంది. దీంతో పంట దిగుబడి అంచనా, మార్కెటింగ్ సౌకర్యాలు, పంట మార్పిడి విధానాలపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది.

బావ అదృశ్యంపై బావమరిది ఫిర్యాదు

అనకాపల్లిటౌన్: తన బావ చిత్తూరు రామకృష్ణ కనిపించడం లేదంటూ పట్టణ పోలీసులకు మంగళవారం అతని బావమరిది ఎం.సంతోష్ ఫిర్యాదు చేశారు. సీఐ దాడి మోహన్‌రావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 16న జాతీయరహదారిపై కాకినాడకు చెందిన లారీ డ్రైవర్ చిత్తూరు రామకృష్ణ ఓ వ్యాన్‌ను ఢీకొన్నాడు. దీంతో భయపడి లారీని అక్కడే వదిలి పరారయ్యాడు. ఎంతకీ తిరిగి రాకపోవడం, ఎలాంటి సమాచారం లేకపోవడంతో అతని అదృశ్యంపై సంతోష్ పోలీసులను ఆశ్రయించారు. బావమరిది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వెల్లడించారు.

అనారోగ్యంతో వాడ్రాపల్లి పంచాయతీ కార్యదర్శి మృతి



వుప్పల శ్రీదేవి

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి పంచాయతీ కార్యదర్శి వుప్పల శ్రీదేవి(39) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో వైద్యం పొందుతూ వచ్చారు. సోమవారం రాత్రి ఆమె మృతి చెందారు. విషయం తెలుసుకున్న వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, సచివాలయ కన్వీనర్ పెతకంశెట్టి రామజోగినాయుడుతో పాటు గ్రామస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి శ్రీదేవి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కాగా సహచర కార్యదర్శులు శ్రీదేవి మృతికి సంతాపం తెలిపారు.

తిరుమల పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పాదయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దాడి వీరభద్రరావు

అనకాపల్లిటౌన్: అనకాపల్లి నుంచి తిరుమలకు దసరా నవరాత్రుల తర్వాత పాదయాత్ర చేసేందుకు ఆసక్తిగల భక్తులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు తెలిపారు. మంగళవారం తన స్వగృహంలో పాదయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పార్టీ నాయకుల ఆధ్వర్యంలో దసరా నవరాత్రుల తర్వాత పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. పాదయాత్ర కన్వీనర్ బుద్ధ మోహన్ మాట్లాడుతూ అనకాపల్లి నుంచి తిరుమల కొండపైకి సుమారు 800 కిలోమీటర్లు ఉంటుందని, రోజుకు 25 కిలో మీటర్లు చొప్పున ఈ పాదయాత్ర సాగుతుందన్నారు. పాదయాత్రకి ప్రస్తుతం 20 మంది పేర్లను నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైన పాదయాత్ర ద్వారా తిరుమల రావాలనుకుంటే 9912890110 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పాదయాత్ర నిర్వాహక సభ్యులు బి.నాగేంద్ర, యల్లపు వెంకట రమణాజీ, సూర్యం పాల్గొన్నారు.